

మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలి

- పోషన్ అభియాన్‌ను పకబ్బందీగా అమలు చేయాలి
- కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు నూతనంగా మంజూరైన భవన నిర్మాణాలను వెంటనే చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం మహిళా, శిశుసంక్షేమ శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అందుబాటులో ఉన్న సదుపాయాలు, సమకూర్చాల్సిన వసతులు తదితర అంశాలపై చర్చించి ఐసీడీఎస్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులకు సూచనలు చేశారు. నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. స్థల సేకరణ కోసం తహసీల్దార్‌ను సంప్రదించి త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పోషన్ అభియాన్ సమర్థవంతంగా అమలు చేస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ, పంచాయతీరాజ్ అధికారి శంకర్ పాల్గొన్నారు.

పోషణ మాసం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలి..

పిల్లల పెరుగుదలకు పోషణలోపం తగ్గించడంలో, బరువు లోపం లేకుండా పోషక ఆహారాలను అందించడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా నిజాయితీగా పనిచేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి చేపట్టనున్న పోషణమాసం కార్యక్రమాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహించనున్న పోషణ మాసంలో భాగంగా రక్తహీనత, పౌష్టికాహార లోపం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చక్కెర, నూనె, ఉప్పు మోతాదుకు మించి వాడకుండా సూచించాలన్నారు. పిల్లల్లో రక్తహీనత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. రక్తహీనత అధిక బరువు వల్ల బాలికల్లో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, మహిళా శిశుసంక్షేమ అధికారి రసూల్‌బీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఈవో అశోక్ పాల్గొన్నారు.

ప్రజా పాలన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు 8

- ముఖ్య అతిథిగా సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి
- కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతుల ప్రదానం 8



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా

- మూడు నెలలకోసారి ప్రతీ స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలించాలి
- లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతర నిఘా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి సలహాసంఘ సమావేశం నిర్వహించారు. ప్రతీ స్కానింగ్ కేంద్రాన్ని తప్పకుండా మూడు నెలలకోసారి పర్యవేక్షించాలని సూచించారు. రిజిస్టర్‌లు, రికార్డులతో పాటు రెఫరల్ స్లిప్‌లను అధికారులు పరిశీలించాలని తెలిపారు. స్కానింగ్ చేయించుకునే ప్రతి ఒక్కరూ రెఫరల్ స్లిప్‌ను తీసుకురావాలని లేకుంటే స్కానింగ్ చేయరాదని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హత లేని స్కానింగ్‌లకు రెఫరల్ చేయకూడదని గైనకాలజిస్ట్‌లు, రేడియోలజిస్ట్‌లు లేకుండా స్కానింగ్‌లు నిర్వహించే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో కొత్తగా రెండు స్కానింగ్ కేంద్రాలకు, నాలుగు స్కానింగ్ కేంద్రాల రినివల్‌కు, ఆర్మూర్ డివిజన్‌లోని ఒక స్కానింగ్ కేంద్రం మూసివేతకు సలహాసంఘం సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్‌లు, పిల్లల వైద్యనిపుణులు, రేడియోలజిస్ట్‌లు తదితరులు పాల్గొన్నారు.

> ఎమ్మెల్సీ కవిత రాజీనామాపై శాసనమండలి చైర్మన్ ఇంకా ఆమోదించకపోవడం ఉత్కంఠ రేపుతోంది. 12 రోజులు గుడుస్తున్నా కవిత రాజీనామాను ఆమోదించకపోవడంతో ఏం జరుగుతుందోనని ఆమె అనుచరులు, జిల్లాలోని రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడంతో ఆమె రాజీనామాను ఆమోదించినా ప్రయోజనం ఉండదు అనే కారణంతో శాసనమండలి చైర్మన్ ఆమె రాజీనామాను ఆమోదించడం లేదా ? లేక ఇతర రాజకీయ పరమైన కారణాలు ఉన్నాయా? అనే కోణంలో రాజకీయ విశ్లేషకులు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్సీ పదవికి బీఆర్ఎస్‌కు రాజీనామా లేఖలను చూపుతున్న కవిత (ఫైల్)



ఏం జరుగుతోంది

కవిత రాజీనామాపై వీడని సస్పెన్షన్

- రాజీనామాను ఆమోదించని మండలి చైర్మన్
- స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడమా ?
- ఇతర రాజకీయ కారణాలా ?
- రాజీనామా ఆమోదంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- సొంత పార్టీ వైపా లేక ఇతర పార్టీల వైపా
- సందిగ్ధంలో కవిత అనుచరులు
- కొద్దిరోజులుగా స్తబ్దతగా ఉంటున్న కవిత
- అయోమయంలో 'జాగృతి' కార్యకర్తలు

నిజామాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేసి 12 రోజులు గడుస్తున్నా శాసనమండలి చైర్మన్ ఇంకా ఆమె రాజీనామాను ఆమోదించకపోవడం ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవిత బీఆర్ఎస్‌పై కొద్దిరోజులుగా విమర్శలు చేస్తుండటంతో ఈనెల 2వ తేదీన ఆమెను బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. దీంతో ఆమె బీఆర్ఎస్ పార్టీకి, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసింది. మండలి చైర్మన్ ఫార్మట్‌లోనే ఆమె రాజీనామాను సమర్పించడంతో రాజీనామా ఆమోదం లాంఛనమే అనుకున్నారు. కానీ గత 12 రోజులుగా శాసన మండలి చైర్మన్ కవిత రాజీనామాను ఆమోదించకపోవడంతో ఏం జరుగుతుందోనని ఆమె అనుచరులు, జిల్లాలోని రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడంతో ఆమె రాజీనామాను ఆమోదించినా ప్రయోజనం ఉండదు అనే కారణంతో శాసనమండలి చైర్మన్ ఆమె రాజీనామాను ఆమోదించడం లేదా లేక ఇతర రాజకీయ పరమైన కారణాలు ఉన్నాయా? అనే కోణంలో రాజకీయ విశ్లేషకులు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. ఒకవేళ రాజీనామాను ఆమోదిస్తే ఇప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేవు. రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోగా

మిగతా 8వ పేజీలో...

రాష్ట్ర వ్యాప్తంగా అనుచరులు..

కవితకు సొంత జిల్లాతో పాటు పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనుచరులు ఉన్నారు. జాగృతి సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో అధ్యక్షుడు, ఇతర కార్యవర్గం, విదేశాలలోనూ జాగృతి అధ్యక్షుడు ఉన్నారు. ఆమె బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినప్పటి నుంచి ఆమె తీసుకునే నిర్ణయం కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు ఆమె వెంట ఎవరూ లేకపోయినా కొంత మంది జాగృతి నేతలు మాత్రం ఆమె వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- పోలీసు కమిషనర్ సాయి చైతన్య
- ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని యువ ఇంజనీర్లు ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్‌డే దినోత్సవాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థుల సంఘం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. దేశంలో చాలా మంది ఇంజనీర్లు దేశం కోసం పనిచేశారు. కానీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. వారు దేశానికి చేసిన సేవలకు గుర్తుగానే ఇంజనీర్స్‌డేను జరుపుకుంటున్నామన్నారు. భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు భారత రత్న అవార్డుతో సత్కరించిందన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో ముందుకు వెళ్లి లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు ఎవరు కూడా డ్రగ్స్, మద్యం, మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని కోరారు. అంతకుముందు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గల విశ్వేశ్వరయ్య విగ్రహానికి సీపీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఇంజనీర్లు గంగాధర్, వీరేశం, రాజయ్య, రమణలను ఘనంగా సన్మానించారు. పాలిటెక్నిక్ కళాశాలలో బంగారు పతకాలను సాధించిన విద్యార్థులకు బిగాల కృష్ణమూర్తి ట్రస్టు నుంచి 10వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ భారతి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి తోట రాజశేఖర్, సహ అధ్యక్షులు రమణ, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, వినోద్ కుమార్, బాలచందర్, బాబా శ్రీనివాస్, గణేష్, నాగరాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య



డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కాలనీ వాసులు

ముందుకు వెళ్లని మురుగు నీరు

మండల కేంద్రంలోని మూడో వార్డులో డ్రైనేజీలు పేరుకుపోయి మురుగు నీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపైనే పారుతోంది. దీంతో ఆ ప్రాంత మంతా కంపుకొడుతోంది. కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. - డొంకేశ్వర్

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- శ్రీవైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా సాగాయి. ఆలయాల్లో మూలవిరాట్‌కు, ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అష్టోత్తర శతనామాలతో తులసీ అర్చన పూజలు జరిపారు. సూర్యుడు సింహరాశిలో ప్రవేశించి అష్టమి రోజున శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. ఆలయాల్లో సాయంత్రం గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి భక్తులు ఉయ్యాల పాటలతో డోలారోహణ జరిపారు. జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీమందిర్, సుభాష్‌నగర్ రామాలయం, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం, ఖిల్లా రఘునాథ ఆలయం, ఆర్యనగర్ వెంకటేశ్వరస్వామి ఆల యం, డిచ్‌పల్లి రామాలయం, కంఠేశ్వర్‌లోని శ్రీకృష్ణ గీతా మందిరం, పోచంపాడ్ రామాలయం, జాన్కంపేట్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, ఆర్మూర్‌లోని రామాలయం, బోధన్ వెంకటేశ్వర స్వామి ఆలయం, మామిడిపల్లి అపురూప వెంకటేశ్వర ఆలయం, చక్రంగుడి వెంకటేశ్వర ఆలయాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు.



సుభాష్‌నగర్ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ ఇంటి ముట్టడికి అంగన్‌వాడిల యత్నం
- అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని వదిలిపెట్టిన పోలీసులు
- ఉద్రిక్తంగా మారిన పీసీసీ చీఫ్ ఇంటి ముట్టడి కార్యక్రమం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు మహేష్‌కుమార్ ఇంటి ముట్టడియత్నానికి ప్రయత్నించగా పోలీసులు నగరంలోని బస్వాగార్డెన్ వద్ద అడ్డుకున్నారు. మారువేశంలో ముట్టడికి యత్నించిన అంగన్‌వాడీ టీచర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టు చేసిన నాయకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. బస్వాగార్డెన్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసేవరకు కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయడంతో నిరసనను విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాటం చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలకు పెంచుతామన్న వేతనాన్ని వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, కోశాధికారి చంద్రకళ, ఉపాధ్యక్షురాలు మంగదేవి, నాయకులు వాణి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యాక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ వెంకట్

మహిళా సంఘాల్లోనూ నగదు రహిత లావాదేవీలు

- పైలెట్ ప్రాజెక్టుగా నందిపేట ఎంపిక
- సెర్ప్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్

నందిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలలోను ఇక నుంచి నగదు రహిత లావాదేవీలు జరపడానికి నందిపేట మండలంను పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని సెర్ప్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ వెంకట్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిర క్రాంతి పదం కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం అధ్యక్షులు, అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. స్మాట్, ఆన్‌రైడ్ సెల్ ఫోన్ల ద్వారా గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా రూ. లక్ష వరకు, చిన్న మొబైల్ (డాబ్బా) పోన్‌ల ద్వారా రోజుకు రూ.5 వేలు లావాదేవీలు జరుపుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌డీవో మధుసూదన్, డీపీఎం సంధ్యారాణి, ఏపీఎం ఖాందేష్ గంగాధర్, జిల్లా, మండల సమాఖ్య ప్రతినిధులు, వివిధ బ్యాంకు అధికారులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

బతుకులు.. భారం!



సమ్మె చేస్తున్న నాయకులు (ఫైల్)

- అరకొర వేతనాలతో కారోబార్ల ఇబ్బందులు
- నాలుగు నెలలకోసారి జీతాలు
- ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు

డొంకేశ్వర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్ల జీవితాలు ఇబ్బందిగా మారాయి. జిల్లాలో 545 పంచాయతీలు ఉండగా 500 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేక విధులు నిర్వహిస్తున్నారు. రూ.9,500 వేతనంతో పనిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీలో కార్యనిర్వహణ అధికారి నిర్వహించే పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. క్యాష్ బుక్ రాయడం, ఇంటి, నల్లపన్నుల వసూలు, కొత్తగా నిర్మించే ఇళ్లకు అనుమతులు ఇవ్వడం, రికార్డులు, పంచాయతీ సమావేశాల మినిట్ బుక్ రాయడం, అజెండా తయారు చేయడం, గ్రామాల్లో సభ్యులకు చేరవేయడం, లైసెన్స్ ఫీజులు తదితర పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోకి వెళ్లి స్వయంగా పాల్గొని పథకాలు అమలు చేయడంలో వీరే ముందుంటారు. ఎన్నికల నిర్వహణలో ముందుండి పనిచేస్తారు. ఇన్ని రకాల పనులు చేస్తున్న వారిని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. 2019లో అప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న వాళ్లందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా మారుస్తూ జీవో నం. 51 తీసుకువచ్చింది. ఆ జీవోతో పంచాయతీలో పనిచేస్తున్న వారందరికీ సమాన వేతనం చెల్లిస్తున్నారు. పాతికేళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు ఎలక్ట్రిషన్లు, అసిస్టెంట్‌గా ఏళ్ల తరబడి సేవలందించినప్పటికీ తమను పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కుటుంబ పోషణ కష్టమవుతోంది..

: రంజిత్‌కుమార్ గౌడ్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు



చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతోంది. పని భారంతో ఇబ్బంది పడుతున్నాం. మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి జీతాలు వస్తున్నాయి. కారోబార్లకు అసిస్టెంట్ సెక్రటరీగా ప్రమోషన్ ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇవ్వలేదు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి గ్రీన్ ఛాలెంజ్ ద్వారా రూ.18 వేల వేతనాన్ని చెల్లించాలి.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి..

: నాగస్వామి కారోబార్ల సంఘం మండలాధ్యక్షుడు



ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలలో కారోబార్‌లుగా పనిచేస్తున్న కనీస వేతనం రాక పూట గడవని పరిస్థితి నెలకొంది. వేతనాలు కూడా సమయానికి ఇవ్వడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ప్రభుత్వం తమను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలి.

అప్పు తెచ్చిన యూరియా దొంగతనం


యూరియా బస్తా తీసుకెళ్తున్న యువకులు

భిక్కనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే యూరియా కొరతను ఆసరాగా చేసుకున్న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామ శివారులో వ్యవసాయ క్షేత్రంలో దాచుకున్న యూరియా బస్తాను దొంగిలించారు. వివరాలు.. రామేశ్వర్‌పల్లికి చెందిన తక్కళ్ల గంగారెడ్డికి సొసైటీలో యూరియా దొరక లేదు. దీంతో తన ఇంటి పక్కన రైతు వద్ద చేబదులు(అరువు) కింద ఒక యూరియా బస్తాను తీసుకుని మొక్కజొన్నకు వేయడానికి కలెక్టర్ రోడ్డులో ఉన్న తన వ్యవసాయ బావి వద్ద ఉంచాడు. అనంతరం ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి వెళ్లేసరికి బస్తా మాయమైంది. స్థానికులను ఆరా తీయగా ఇప్పుడే టోల్‌గేట్ వైపు వెళ్లారని తెలిపారు. టోల్‌గేట్‌లో సిబ్బంది సహకారంతో సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు బైక్‌పై యూరియా బస్తా వేసుకుని వెళ్తున్నట్లు రికార్డైంది. ఫోటోను బాధితుడు వాట్సప్ గ్రూపుల్లో వేయగా వైరల్ అయ్యింది. చివరికి బస్తాను ఎత్తుకెళ్లిన యువకులు తిరిగి రైతు ఇంటికి వచ్చి తప్పైందని క్షమాపణ చెప్పి యూరియా బస్తాను అప్పగించారు.

క్రైం సమాచారం

రైలుకు ఎదురెళ్లి యువకుడి ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలుకు ఎదురుగా వెళ్లి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం సాలూరా మండలం ఖాజాపూర్‌కు చెందిన పవన్ బీటెక్ పూర్తిచేసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. ఉద్యోగం లేక బెట్టింగ్, తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తరచూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి అప్పులు తీర్చాలని ఒత్తిడి తేగా, వారు స్పందించకపోవడంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడన్నారు. తీవ్రగాయాలతో రైల్వేట్రాక్ వద్ద పడిఉన్న అతన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

భిక్కనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ కామారెడ్డి సెకెండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ టి.చంద్రశేఖర్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ నెల 15న భిక్కనూరులో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన పోచమ్మల స్వామి మద్యం సేవించి పట్టుబడ్డాడన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంజీరాలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీర్కూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం దామరంచ గ్రామ సమీపంలోని మంజీర నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35 నుండి 45 సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి ఎడమ చేతి పైన లింగమ్మ అని రాసి ఉందని, ఎడమ చేతి బొటన వేలు భాగంలో మూడు పచ్చ బొట్టు గీతలు ఉన్నాయన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐరన్ రాడ్‌లను దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

నవీపేట,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో ఇటీవల ఐరన్ రాడ్‌లను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన పీరాజీని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఇటీవల యంచ బ్రిడ్జి వద్ద డంప్ చేసి ఉన్న సుమారు రెండు టన్నుల ఐరన్ రాడ్‌లను పీరాజీ తన ట్రాక్టర్‌లో తీసుకెళ్లాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఐరన్ రాడ్‌ల విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనూష ప్రాజెక్టు మేనేజర్ పార్థసారధి ఫిర్యాదు మేరకు పీరాజీని అరెస్ట్ చేసి ఐరన్ రాడ్‌లతో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వినాయక స్వామి ఆలయంలో చోరీ

బీర్కూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం పరిధిలో గల వినాయక స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులకు వేసిన తాళాలు పగుల గొట్టి లోపలికి ప్రవేశించారు. వెండి వినాయకుని ప్రతిమను ఎత్తుకుపోయారు. ఆ ప్రతిమ ఏడు గ్రాములు ఉంటుందని, అలాగే హుండీ డబ్బులు, చిన్న పాటి నగలు దోచుకుపోయారని స్థానికులు తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడులు.. వ్యక్తిపై కేసు

బీర్కూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరాంచ గ్రామంలో ఒక బెల్టు షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం మద్యం షాపుపై దాడులు నిర్వహించారు. దాదాపు రూ.30 వేల విలువైన 127 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుధాకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.


మృతిచెందిన సాయిలు

కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి

గాంధారి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదెల్లికి చెందిన కర్రోల్ల సాయిలు(57) అదే గ్రామానికి చెందిన కాగుల మొగులయ్య అనే రైతు వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నాడు. సోమవారం వరిలో కలుపు తీయడానికి తన భార్య లలితతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం భార్య భోజనం తేవడానికి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పంటకు నీరు పెట్టడానికి బోరుమోటారు వేసే క్రమంలో స్టార్టర్ వద్ద వైరు తేలి ఉండటంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

మంట కలుస్తున్న మానవ సంబంధాలు

● డబ్బు, వివాహేతర సంబంధాలు హత్యలకు ప్రధాన కారణం ● పెరుగుతున్న నేరప్రవృత్తి ● ఉమ్మడి జిల్లాలో భయపెడుతున్న ఆస్తి, భూ తగదాలు

కామారెడ్డి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కురువృద్ధులకు సేవలు చేయలేక తల్లిని చెరువులో పడేసి హత్యచేసిన కొడుకు.... కొడుకు చేతిలో ఆస్తి కోసం తండ్రిని హత్యలు చేస్తుండగా... భార్యను భర్త...భర్తను భార్య పలు అనుమానాలతో హతమారుస్తుండగా...తల్లిని కొడుకు.. ఇంటికోసం తోడబుట్టిన సోదరున్ని హతమారుస్తూ.. ఇలా మానవ సంబంధాలను మంటగల్పుతున్నారు. జిల్లాలో తరచూ చోటుచూసుకుంటున్న హత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల పిట్లం మండలంలోని బొంకంపల్లి శివారులో మంజీర నదిలో ఓ కొడుకు తన వృద్ధతల్లికి సేవలు చేయక ఊపిరి ఉండగానే మంజీర నదిలో పడేసి హత్యచేసిన ఘటన జిల్లా వాసులను కలిచివేస్తుంది.

అయినవారినే హతమారుస్తున్నారు

జిల్లాలో తరుచూ చోటుచేసుకుంటున్న హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది 9నెలల కాలంలోనే 23 హత్యలు జరిగాయి. గత ఏడాది 37 హత్యకేసులు నమోదయ్యాయి. ఈనెల 11న మంజీర నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం కాగా స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన ఏర్రోళ్ల సాయవ్వ(77) మృతదేహంగా గుర్తించారు.అయితే సాయవ్వ అతని కుమారుడు బాలయ్యతో కలిసి ఉండేవారు. సాయవ్వ అనారోగ్యానికి గురికావడంతో సేవలు చేయలేక భారంగా భావించిన బాలయ్య తల్లిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ద్విచక్రవాహనంపై తల్లిని ఈనెల 8న తీసుకెళ్లి పిట్లం మండలం బొల్లక్‌పల్లి శివారులోని మంజీరనదిలో ఊపిరి ఉండగానే పారవేసి హత్యచేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇదిలా ఉండగా గతంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బస్టాండ్ ముందు నడిరోడ్డుపై మహేశ్వరి (45) అనే మహిళను భర్త నర్సింలు కత్తితో విచక్షణ రహితంగా పొడిచి హత్యచేశాడు. అనంతరం తానుకత్తితో పొడుచుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పిట్లం మండలంలో ఆస్తితగదాలతో కొడుకు తల్లిని కొట్టి చంపాడు. మాచారెడ్డి మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య తగదాలు చోటుచేసుకున్నాయి. మెద్చల్ మండల కేంద్రంలో నడిరోడ్డుపై అన్న ఉమేష్‌పై(30) తమ్ముళ్లు రాఖేష్,లక్ష్మన్‌లు నడిరోడ్డుపై విచక్షణ రహితంగా పొడిచి దారుణంగా హత్యచేసిన ఘటన కలకలం రేపింది. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో రవి(41) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. భూ వివాదాల్లో రవిసోదరుడి కుటుంబసభ్యులే హత్యచేశారు. నస్రూళ్లబాద్ మండలం నెమలి గ్రామంలో మైసయ్య (41) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. మైసయ్య భార్య మరోకరితో కలిసి అతనిని హతమార్చారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని వెల్లడైంది. అదేరోజు మాచారెడ్డిమండలం ఎల్లంపేటలో కుటుంబకలహాలతో భార్యతండ్రి కలిసి భర్త స్వామిపై దాడిచేశారు. ఈ ఘటనలో స్వామి మృతిచెందాడు. భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన నారాయణ (42) సంగారెడ్డిలో హత్యకు గురయ్యాడు. నారాయణ భార్య మరికొందరు కలిసి పథకం ప్రకారం హతమార్చారు. సోంపూర్ గ్రామానికి చెందిన లాలప్పకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకొడుకు సుభాష్ వ్యవసాయభూమిని తనతండ్రి భార్యపేరిట రిజిస్ట్రేషన్ చేశారనే కారణంతో వ్యవసాయపొలంలో లాలప్పను కుమారుడు సుభాష్ హత్యచేశాడు.ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో ఎకరం భూమికోసం కట్టుకున్న భర్తను భార్యకుమారుడు హతమార్చారు. సత్తెలికి చెందిన కుర్మదుర్గయ్యకు రెండెకరాల భూమి ఉంది. ఎకరం తమకు ఇవ్వాలంటూ కుటుంబీకులు దుర్గయ్యను కొట్టిచంపారు. ఇలా జిల్లాలో వారం, పదిరోజులకో హత్యలు జరుగుతూనే ఉన్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆలూర్, సెప్టెంబరు, 15(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం కల్లడి గ్రామానికి చెందిన దొర లింగం, ఇస్సాపల్లి చిన్న బొర్రన్న ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. నిరుపేద కుటుంబం కావడంతో వారి ఆర్థిక పరిస్థితిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం దొరలింగంనకు మంజూరైన రూ.60వేలు, ఇస్సాపల్లి చిన్న బొర్రన్నకు మంజూరైన రూ. 20వేల చెక్కులను అందజేశారు.

ఆలూర్ ఎంపీఓకు సన్మానం

ఆలూర్, సెప్టెంబరు, 15(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల పంచాయితీ అధికారి (ఎంపీఓ)గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన రాజలింగానికి సోమవారం కాంగ్రెస్ నాయకులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు విజయ్, నాయకులు ఆయనను సత్కరించారు.

ఘనంగా ఉట్ల పండుగ

మెండోర, సెప్టెంబరు, 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్ల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ఊరేగింపుగా ఉట్టి కొట్టే దగ్గరికి వెళ్లారు. యువకులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

అంబులెన్సులో మహిళ ప్రసవం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు15: (ఆంధ్రజ్యోతి) మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మంజులకు సోమవారం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబీకులు భీమ్‌గల్‌లోని 108కు సమాచారం అందించగా, హుటాహుటిన గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్సనందించారు. అనంతరం వాహనంలో కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. పైలట్ రాజయ్య, ఈఎంటీ త్రిష వైద్యుల సహాలుతీసుకుని అంబులెన్సులోనే ప్రసవం చేశారు. సదరు మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని వారిని కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

ఆర్మూర్ ,సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్మూర్ సీఐ సత్యనారాయణ, ఎంపీడీవో శివాజీ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన మండల అంతర్ పాఠశాలల గ్రామీణ టోర్నీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మార్చ్‌ఫాస్ట్‌లో మగ్గిడి పాఠశాల ప్రథమ, చేపూర్ ద్వితీయ, తృతీయ బహుమతి ఇస్సాపల్లి, పిప్రి, సుర్భిర్యాల్ పాఠశాలలు కన్సొలేషన్ బహుమతులు సాధించాయి. ఎంఈవో రాజ్‌గంగారాం, టోర్నీ కన్వీనర్ చేతన కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధర్, వీడీసీ సభ్యులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

టీజీహెచ్ఎంల జిల్లా ప్రధాన కార్యదర్శిగా చారి

మోర్తాడ్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ధర్మోర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునందన చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఆయనను ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. పతాని గంగాధర్, రవికాంత్, క్రాంతి కుమార్, గణేష్ గౌరవ్, హన్మాండ్లు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రీడా దుస్తువుల పంపిణీ

ఆర్మూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) : ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాపారి యాంసాని అరుణ్‌కుమార్ క్రీడా దుస్తువులను వితరణ చేశారు. 40 జతల దుస్తువులను సమకూర్చగా సోమవారం ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ విద్యార్థులకు అందజేశారు. దాతకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు భూమేశ్వర్, రమేష్, బాలక్రిష్ణ ప్రసాద్, సంతోష్, గంగామోహన్, రాజేశ్వర్, రవికుమార్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి , సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థులకు నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచ్‌లు నర్సారెడ్డి, బాలకిషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు చిట్ల శ్యాం, మాడవేరి రఘు క్రీడా దుస్తులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు లింగన్న, వ్యాయమ ఉపాధ్యాయుడు రంజిత్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

విజయ్ హైస్కూల్‌లో మాతృమూర్తుల సమావేశం

ఆర్మూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థుల మాతృమూర్తుల సమావేశం నిర్వహించారు. కరస్పాండెంట్ కవితాదివాకర్ మాట్లాడుతూ.. పిల్లల చదువు, క్రమశిక్షణ తదితర వాటిపై సలహాలు, సూచలు చేశారు. మాతృమూర్తులకు వివిధ క్రీడ అంశాలలో పోటీలు నిర్వహించారు.

'ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి'

డొంకేశ్వర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని డొంకేశ్వర్ ఎంపీడీవో లింగం అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండలం నికల్ పూర్ గ్రామపంచాయతీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు తొందరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి విఠలచారి, వనజ, గ్రామస్థులు పాల్గొన్నారు

నూతన జీపీవోలకు సన్మానం

వేల్పూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ఇటీవల కొత్తగా వచ్చిన గ్రామ పరిపాలన అధికారులను సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో స్థానిక యువకులు నరేందర్, బండి గంగాధరన్, రాగి ప్రభాకర్, రవీందర్ యాదవ్‌లు శాలువతో సన్మానించి వారికి స్వాగతం పలికారు. గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు టిఫిన్ బాక్సులు, పెన్నుల వితరణ

వేల్పూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టిఫిన్ బాక్సులు, పెన్నులను గ్రామానికి చెందిన కొలిప్యాక సత్యంరెడ్డి దంపతులు సోమవారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఏర్గట్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోంచంద గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రావనికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మెంకయ్యగారి వెంకట్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయాలు కాగా అతన్ని, పుట్టి గంగాధర్, మరాఠీ జ్యోతి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3 వేల సాయం అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కోటగిరి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్, పోతంగల్ మండలం సుంకినికి చెందిన రైతు అభిషేక్ వేర్వేరు ప్రమాదాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు నవీన్, సాయాగౌడ్, ప్రకాష్ పటేల్, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తన ట్రస్టు ద్వారా బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున సాయం అందించారు.

నాళేశ్వర్ ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల

నవీపేట,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్ ఎత్తిపోతల పథకం ద్వారా సోమవారం ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. గత నెల 30న భారీ వర్షాలు, వరదలతో నాళేశ్వర్ ఎత్తిపోతల పథకం నీట మునిగింది. దీంతో మోటార్లు పాడైపోగా ఆయకట్టు రైతులు సొంతంగా మోటార్లు మరమ్మత్తులు చేయించుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8మందికి జరిమానా

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 8మందికి జరిమానాతో పాటుగా ఒకరికి జైలు శిక్ష పడినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సోమవారం తెలిపారు. భిక్కనూరు మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.వెయ్యి జరిమానా విధించడం జరిగిందన్నారు.

యూరియా కోసం అంబేద్కర్ విగ్రహానికి వినతి

జక్రాన్‌పల్లి ,సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశ్‌పల్లి గ్రామంలో సోమవారం యూరియా కోసం బీఆర్ఎస్ నాయకులు, గ్రామ రైతులు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి బుద్ధి కల్గించి రైతులకు సకాలంలో యూరియాను అందించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ మైదం మహేశ్వర్, మాజీ ఎంపీటీసీ గంగాధర్, దేవేష్, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఆర్మూర్ టౌన్, సెప్టెంబరు, 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దాల నాగరాజు డిమాండ్ చేశారు. అనంతరం సిద్దార్థ డిగ్రీ కళాశాల ముందు నిరసన తెలిపారు.

హిందీ కవులపై చిత్రలేఖనం

ముప్కాల్, వేల్పూర్, పెర్కిట్ సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవులపై చిత్రలేఖనం, హిందీ దేశభక్తి గీతాలు, నాటికలు, కవితలు వంటివి ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బోధన్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మంత్రుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు ఏశాల గంగాధర్, శంకర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముట్టడిలో భాగంగా బోధన్‌లోని ఆశా వర్కర్లు, హెల్పర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు కుమార స్వామి, విజయలక్ష్మి, ప్రసన్న, ఉషారాణి, కవిత, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్ ,సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ ఆధ్వర్యంలో పల్లికీ సేవలో భక్తులు, ఆర్మూర్ భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తు భక్తి గీతాలు పాడారు. భక్తులకు గుండెటి నర్సారెడ్డి, హనుమాబాయి , రాధ, మహిపాల్ కుటుంబాలు గుట్టపై విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, చరణ్‌రెడ్డి, రవి, కొడిగెల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడలు

జక్రాన్‌పల్లి ,సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడలు జరగనున్నాయి. ఈ నెల 18, 19, 20వ తేదీల్లో ఈ క్రీడలను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు

నవీపేట,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన పలువురు సీఐటీయూ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ముందస్తుగా అరెస్టు అయిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, ఆశ కార్యకర్తలు, తదితరులున్నారు.


కోటగిరి విండోలో పంట రుణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): పంట రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి విండో అధ్యక్షులు కూచి సిద్దు సూచించారు. కోటగిరి సహకార సంఘంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 11మంది సభ్యులకు సోమవారం 7,82,500రూపాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, గడువులోపు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విండో కార్యదర్శి విఠల్, సభ్యులు శ్రీనివాస్, రైతులు గణేష్, బాల్‌గొండ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి'

వేల్పూర్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై మాట్లాడిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సునీల్‌రెడి అడ్డగోలు ఆరోపణలు మానుకోవాలని బాల్కొడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. వేల్పూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ నాయకుల సోమవారం విలేకరులతో మాట్లాడారు. యూరియా కొరతపై సమాధానం చెప్పకుండా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువగానే యూరియాను తమ కాంగ్రెస్ ప్రభుత్వం సరఫరా చేసిందని సునీల్‌రెడ్డి అనడం అవివేకమన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇంజనీర్లను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి


బోధన్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆదర్శ క్లబ్ సభ్యులు పావులూరి వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం ఇంజనీరింగ్స్ డే సందర్భంగా వివిధ విభాగాలలో పని చేస్తున్న ఇంజనీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు దేశానికి ఉపయోగపడే ఇంజనీర్‌లుగా తయారు కావాలన్నారు. నేటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ, సంతోష్, ఇంజనీర్‌లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వెంకటేశ్వర్ రావు, బండ్ల వెంకట్ రావు, రాజారావులతో తదితరులున్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

బోధన్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోధన్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే ముద్దు, మత్తు వద్దు అనే సందేశంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తాత్కాక ఆనందాన్ని ఇస్తాయని, కాని శాశ్వతంగా జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సురేష్ కుమార్, ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, అమృత హస్పటల్ వైద్యులు డాక్టర్ సుధాకర్, ఆర్ఎస్‌పీ రాష్ట్ర సహాయ కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా, ఏఐపీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాయి కుమార్, ఉపాధ్యక్షులు గోపాల్ సింగ్ ఠాగూర్, కళాశాల విద్యార్థినిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని డిమాండ్

నెట్‌వర్క్: పెన్షన్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లాలోని పలు మండలాల్లో ధర్నాలు చేపట్టారు. ఆర్మూర్, మెండోర, ఏర్గట్ల, వేల్పూర్, సాలూర, కోటగిరి మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించారు.


పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దివ్యాంగులకు పింఛన్ పెంపు హామీని ప్రభుత్వం అమలు చేయాలి

బోధన్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా పింఛన్‌దారులకు పెంపు హామీని తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. సోమవారం అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు లస్సింగారి భూమయ్య, మాధవరావు, లక్ష్మి, పర్విన్, హన్మాండ్లు, ధర్మయ్య, సైదయ్య, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

● మరోవైపు రుద్రూర్, నందిపేట మండలాల్లోనూ దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

నందిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో సోమవారం మైనార్టీ స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మంగ్లారపు ధర్మన్న, సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, మండల మైనార్టీ విభాగం అధ్యక్షులు యుసూఫ్, నాయకులు మంగ్లారపు తుక్కన్న, గుండు హరీష్, తబ్రేష్, రఫీక్, ముజీబ్, జావెద్ తదితరులు ఉన్నారు.

తాళ్లరాంపూర్ గౌడలపై గ్రామస్థుల దాడులు

నిజామాబాద్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సెప్టెంబరు 15: మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో గీత కార్మికులకు, వీడీసికి మధ్య వాగ్వాదం గత సంవత్సరకాలంగా కొనసాగగా ఇటీవలే వీడిసీని రద్దు చేస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ ప్రకటించుకుంది. గీత కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపినప్పటికీ గీత కార్మికులకు రక్షణ లేకుండా పోయింది. సోమవారం తాళ్ళరాంపూర్‌లో గీత కార్మికుల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. వివరాల్లోకి వెళితే ఆదివారం సాయంత్రం గ్రామస్థులకు సంబంధించిన భూముల్లో కొన్ని చోట్ల ఉన్న ఈత చెట్లను తొలగించారు. సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందటంతో ఎక్సైజ్ శాఖ, పోలీస్ అధికారులు గ్రామానికి వెళ్ళి సరిచెప్పే ప్రయత్నం చేయగా గ్రామస్థులు ఆగకుండా గీత కార్మికుల సంఘ భవనంపై వెళ్ళి దాడులకు ప్రయత్నం చేశారు. కాగా గౌడస్థులు సంఘంలో తల దాచుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

అనుమతి తీసుకొని చెట్లు తొలగించాలి

ఈత వనానికి చెందిన చెట్లను తొలగించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవాలి. అనుమతి లేకుండా చెట్లు తొలగించడం సరికాదు.

- గుండప్ప, ఎక్సైజ్ సీఐ మోర్తాడ్

పలు పాఠశాలల్లో హిందీ దివస్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్లో సోమవారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఏడాది 14 సెప్టెంబర్ రోజున హిందీ దినోత్సవం నిర్వహించు కోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ గాంధీ అన్నారు. హిందీ భాష దేశంలోనే ప్రజలను ఏకమవడానికి ఉపయోగ పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలవంతరావు, ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.



విద్యార్థులు నృత్యాలు చేస్తున్న దృశ్యం


ఎక్లారా గురుకులంలో నృత్య ప్రదర్శన

పెద్ద ఎక్లారలో..

మద్నూర్: హిందీ దివస్ పురస్కరించుకొని మండలంలోని పెద్ద ఎక్లార సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ భాష ప్రాముఖ్యతపై విద్యార్థినులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడు తూ హిందీ భాష భారత సంస్కృతికి ప్రతిరూపమని గుర్తు చేశారు. హిందీ భాష రాజభాష కావడంతో ప్రభుత్వ విభాగాల్లో సమన్వయం వచ్చిందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి వంటి వేదికలపై ఈ భాషకు వచ్చిన అంగీకారం భారతదేశ సాంస్కృతిక శక్తికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు నృత్య ప్రదర్శనతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు.

వామ్మో.. చిరుత


మద్నూర్ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

▸▸భయాందోళనలో రైతులు

మద్నూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో చిరుత పులి సంచరిస్తుందని ప్రత్యక్షంగా చూసిన సాక్షులు చెప్పడంతో రైతులు తమ పంట పొలాలకు వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై సోమవారం మద్నూర్ తహసీల్దార్ ముజీబ్‌కు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. చిరుత పులి సంచరిస్తుందని ప్రభుత్వం వాటిపై నిఘా పెట్టి, వాటిని కట్టడి చేసే విధంగా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పంట పొలాల్లో సోయా పంటలు ఉన్నాయని వాటి సంరక్షణ కోసం వెళ్లాల్సిన రైతులు చిరుత పులి ఉందన్న సమాచారంతో తమ పంట పొలాలకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి చిరుత పులి సంచారం పై కట్టడి చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన రైతులు వోడే సాయిలు, ఖైదల్ చందర్, హనుమాన్లు, గంగాధర్, పరమేష్, సాయిలు, మాజీ ఎంపీటీసీ కరెవర్ రాములు ఉన్నారు.

పంజరం ఏర్పాటు చేస్తాం

● ఫారెస్ట్ రేంజ్ అధికారిణి సంతోషి

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో మూడు రోజులుగా చిరుత కలకలంతో ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారని తహసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన తర్వాత ఫారెస్ట్ రేంజ్ అధికారిణి సంతోషి, డిప్యూటీ రేంజ్ అధికారిణి సుజాత తహసిల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. చిరుత పులికి సంబంధించిన ఆనవాళ్లు లేవని రోజుకో గ్రామంలో ఉన్నట్లు చెబుతుండటంతో పంజరాలు ఏర్పాటు చేయడానికి కుదరదని ప్రస్తుతం సరిహద్దులోని మహారాష్ట్ర గ్రామమైన నాగ్రాల్ అటవీ ప్రాంతంలో రెండు రోజులు ఉన్నట్లయితే ఆ ప్రాంతంలో పంజరం ఏర్పాటు చేస్తామని సూచించారు.


రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారిణి

నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా లలిత కుమారి


నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న లలిత కుమారి

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా లలిత కుమారి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాకు బదిలీ పై వచ్చిన లలిత కుమారిని జిల్లా అధికారులు నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా పోస్టింగ్ ఇవ్వడంతో ఆమె సోమవారం నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండటంతో మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ చారి, ఇంచార్జి ఎంపీడీవోగా కొనసాగారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు.

మాదక ద్రవ్యాలు, సైబర్‌నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో, ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహం లో షీటీం సభ్యులు రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీస్ కళా బృందం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాటల రూపంలో విద్యార్థులు భవిష్యత్తుపై మంచి లక్ష్యాన్ని ఎంచుకుని చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం బృందం ఉన్నారు.

బూర్గుపల్లి వాసులకు అందనున్న తపాలా సేవలు


ఖాతా తీయాలంటూ గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుపల్లి గ్రామస్తులకు త్వరలో పోస్టాఫీస్ సేవలు అందనున్నాయి. గతంలో ఈ గ్రామస్తులకు పోస్టాఫీస్ సేవలు కాస్లాబాద్ గ్రామం నుండి అందగా, తమకు పోస్టాఫీస్ లేకపోవడంతో ఇబ్బందులు అవుతున్నాయని గ్రామస్తులు ఈ విషయం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌కు విన్నవించడంతో ఎమ్మెల్యే ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలపడంతో బూర్గుపల్లికి పోస్టాఫీస్ మంజూరయ్యిందని గ్రామస్తులు తెలిపారు. అందుకు అనుగుణంగా పోస్టాఫీస్ సిబ్బంది సోమవారం గ్రామంలో ప్రజలకు ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పిస్తూ ఖాతాలను తీసుకోవాలంటూ అవగాహన కల్గించారు. త్వరలో గ్రామంలో తపాలా శాఖను ఏర్పాటు చేసి గ్రామస్తులకు సేవలు అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిపిఎంలు పండరి, పుష్పలత, శేఖర్ గౌడ్, రవి, సాయికుమార్, పద్మ, సాయిలు, ఏబిఎం నయిం, రాంరెడ్డి, దత్తు పాల్గొన్నారు.

బీర్కూర్ విండో అధ్యక్షుడిగా రాములు

బీర్కూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ సహకార సంఘం నూతన ఇన్‌చార్జి అధ్యక్షుడిగా ఇంగు రాములును నియమిస్తూ డీసీఓ రాంమోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఈవో విఠల్ తెలిపారు. గత కొన్ని నెలల క్రితం విండో అధ్యక్షుడు గాంధీ వ్యక్తిగత కారణాల వల్ల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న రాధాకృష్ణకు ఇన్‌చార్జి అధ్యక్ష బాధ్యతలు కట్టబెడుతూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా రాధాకృష్ణ సహకార సంఘంలో 1.20 లక్షల విలువైన ఎరువులను తన స్వంత వ్యవసాయ అవసరాల కోసం వాడుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో డీసీఓకు ఫిర్యాదులు అందడంతో రాధాకృష్ణకు నోటీసులు పంపారు. నోటీసులకు ఆయన నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఉన్నతాధికారులు ఆయన స్థానంలో ఇంగు రాములుకు ఇంచార్జి అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బడా భీమ్‌గల్, నవీపేట గ్రామ పంచాయతీల ముట్టడి


బడా భీమ్‌గల్‌లో గ్రామ పంచాయితీని ముట్టడించిన గాంధీ నగర్ కాలనీ వాసులు


నవీపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వీహెచ్‌పీఎస్ నాయకులు

భీమ్‌గల్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో సోమవారం గాంధీ నగర్ కాలనీ వాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో మురుగు కాలువల శిథిలావస్థకు చేరి మురుగునీరు బయటకు పోకుండా దుర్గంధం వెదజల్లి, దోమలు విపరీతంగా పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే మురుగునీరు అంత ఇంట్లోకి వచ్చి ఇబ్బందులకు గురవుతున్నమని మూడేళ్ల నుంచి గ్రామ పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన మురుగు కాలువలను తొలగించి , కొత్త మురుగు కాలువలు నిర్మించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. దీనిపై గ్రామ పంచాయితీ కార్యదర్శి రజితను వివరణ కోరగా నూతన డ్రైనేజీ కొరకు మండల అధికారులకు నివేదిక ఇచ్చామని, అలాగే కాలనిలో కొత్తగా నిర్మించిన ఇండ్ల యజమానులు డ్రైనేజీ పై మెట్లు నిర్మాణం చేయడం ద్వారా మురుగునీరు పోకుండా ఇబ్బంది అవుతుందని, మెట్లను తొలగించి సమస్య పరిష్కారం చేస్తామని అన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో

నవీపేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు సోమవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వృద్ధులు, వితంతువులకు నెలకు 2వేల నుండి 4వేల రూపాయల పింఛన్, దివ్యాంగులకు 4 వేల నుండి 6వేల రూపాయల వరకు పెంచుతామని హామీ ఇచ్చిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచిన సంబంధిత హామీలను ఇప్పటికి అమలు చేయలేదని వారు పేర్కొన్నారు. వెంటనే వృద్ధులు, వితంతువులతో పాటు దివ్యాంగులకు పింఛన్‌లను పెంచి ఇవ్వాలని తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్, గంగాధర్, యూసుఫ్, నరేష్, పోశెట్టి, గంగామణి, లక్ష్మి తదితరులున్నారు.

వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠల్‌వాడీ గ్రామ శివారులో ఇటీవల వరదలకు కూలిపోయిన వంతెన నిర్మాణానికి గాను ఉపాధి నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. విఠల్‌వాడీ గ్రామ శివారులో గల ఈ వంతెన గత సంవత్సరం నుండి శిథిలావస్థకు చేరగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన తెగిపోయింది. దీంతో విఠల్‌వాడీ-విఠల్‌వాడీ తాండల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాక లింగంపల్లి, విఠల్‌వాడీ, బాబల్‌గాం, చింతల్‌వాడీ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద కొడప్‌గల్ మండలకేంద్రానికి రాకుండ అంతరాయం ఏర్పడింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తెలపడంతో ఉపాధి హామి నిధులు 50 లక్షలు మంజూరయ్యాయి. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంతవాసులు వంతెన నిర్మాణం కోసం ఎదురుచూపులు చూస్తుండగా వారి నిరీక్షణ ఫలించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

స్వచ్ఛ భారత్ నిధులతో మూత్ర శాలల నిర్మాణం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛ భారత్ నిధులతో మూత్రశాలల నిర్మాణానికి గాను సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతు ఆసుపత్రికి వచ్చే రోగులకు మూత్రశాలలు లేక కలుగుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకోపోగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద 5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో రానున్న రోజుల్లో ఆసుపత్రి ఆవరణలో మూత్ర శాలల నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సుదర్శన్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు చిప్ప మోహన్, నాగ్‌నాథ్‌పటేల్, మల్లప్ప పటేల్, కల్లూరి పండరి, విఠల్, మొగులాగౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌ను ప్రారంభించిన ఎంఈవో


తిమ్మాపూర్‌లో ప్రీ స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో రాజులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం ఎల్లారెడ్డి ఎంఈవో రాజులు ప్రీ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి ఆరు ఏళ్ల వయస్సు గల పిల్లలకు ప్రీ స్కూల్ విద్యా అందించడమే ఈ పథకం ఉద్దేశం అన్నారు. దీని ద్వారా పిల్లలను పాఠశాలల్లో చేర్పడానికి సిద్ధం చేయవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఇంద్రజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు యాద య్య, ఉపాధ్యాయురాలు దివ్య, అంగన్‌వాడీ కార్యకర్త గోదావరి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులుపాల్గొన్నారు.

చెక్కు అందజేత

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివ్వాపూర్ గ్రామానికి చెందిన సవితకు సోమవారం సహకార సంఘం ఆధ్వర్యంలో జనతా పర్సనల్ యాక్సిడెంట్ కింద మంజూరైన 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విండో ఇంచార్జి చైర్మన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతు గత జనవరి నెలలో సహకార సంఘంలో సభ్యుడైన మధుసింగ్ రోడ్డు ప్రమాదంలో మరణించారని, అతను సహకార సంఘంలో జనతా పర్సనల్ యాక్సిడెంట్ కింద బీమా చేసుకోవడంతో మృతుడి భార్యకు చెక్కు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి వైస్ చైర్మన్ సంగారెడ్డి, డైరెక్టర్ నాగిరెడ్డి, సీఈవో సందీప్, నాయకులు కుమార్ సింగ్, మల్లికార్జున్, తానాజీ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పన్ను రేట్ల తగ్గింపు: బీజేపీ


ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు

మద్నూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో సాధారణ ప్రజలకు పూర్తిస్థాయిలో ఖచ్చితంగా ప్రయోజనాలు అందుతాయని బీజేపీ మండల అధ్యక్షుడు తెప్ప తుకారం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి వ్యాపారస్తులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ తర్వాత జీఎస్టీ అమల్లోకి వస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు కృష్ణ పటేల్, సంతోష్, అజయ్, రాజు, మాజీ సింగిల్ విండో చైర్మన్ పండిత్ రావు పటేల్, వ్యాపారస్తులు వారి నాగ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో ఉపాధ్యాయ దినోత్సవం

సాలూర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజూష అధ్యక్షత వహించగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 8మంది ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. పీఎల్‌ఎం మేళాలో ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు చిరస్థాయిగా గుర్తించుకునేవని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాయిలు, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, అరుణ్, విఠల్ కాంబ్లే, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

బోధన్,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ ప్రజలు తమ ఇంటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. సోమవారం పన్నుల వసూలులో భాగంగా ఆయన బోధన్ పట్టణంలో పర్యటించారు. అంబేద్కర్ చౌరస్తాలోని శిశు రక్ష హస్పిటల్ వారు రూ. 1,27,776 ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారులతో పాటు ప్రజలు మున్సిపాలిటికి చెల్లించాల్సిన పన్ను బకాయిలు చెల్లించి బోధన్ మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు.


పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

పింఛన్లు పెంచాలి

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు, వృద్ధులకు చేయూత పింఛన్‌లతో పాటు బీడీ కార్మికులకు పింఛన్‌లు పెంచాలని బోధన్, ఎల్లారెడ్డిలలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు.


బోధన్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు


సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం తలపెట్టింది. సోమవారం పోలీసులు సీఐటీయూ నాయకులు జె.రవీందర్, ఖలీల్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ టౌ న్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు బీఆర్ఎస్ ప్రభు త్వం , నేడు కాంగ్రెస్ ప్ర భుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ , కా ర్యదర్శి శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, చిరంజీవి, మహేశ్ ఉన్నారు.

దివ్యాంగుల పింఛన్ మొత్తాన్ని పెంచాలి


దివ్యాంగుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.4వేలను రూ. 6వేలకు పెంచాలంటూ దివ్యాంగులు సోమవారం టపట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కిరణ్మయికి డి మాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత దివ్యాంగుల పింఛన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సాయిలు, సంఘ సభ్యులు తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో దర్గా ఉత్సవాలు


దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని గోపాల్ పేట్ గ్రామంలో పీరానే పీర్ గౌసే ఆజం దస్తగీర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ దర్గా ఉత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఖాన్ ఖాయే ఆబిదుల్ హాష్మీ పీఠాధిపతి సూఫీ షా హజ్రత్ ముహమ్మద్ షరీఫోద్దీన్ షత్తారీ ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ఖురాన్ పఠణంతో ఉత్సవాలు ప్రారంభించారు. ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. కుల, మతాలకతీతంగా ఈ దర్గా ఉత్సవాలలో భక్తులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ వినతులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి
- కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి
- ప్రజావాణిలో 115 వినతులను స్వీకరించిన అధికారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి వినతులకు ప్రాధాన్యం ఇచ్చి సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు కృషిచేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 115 వినతులు అందాయి. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్రియాన్ మావి, డీఆర్‌డీవో సాయగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, బోధన్ ఏసీపీ శ్రీనివాసులు వినతులు స్వీకరించారు. వినతులను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి..

ఇటీవల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బోధన్ నియోజకవర్గ రైతులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీరాంసాగర్ వెనక జలాల వల్ల నష్టపోయిన పంట ఆస్తి నష్టానికి సహాయక నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మోహన్ రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేస్తున్నారు..

ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన భూమిలో రోడ్డు ఇవ్వాలని వన్నెల్ (బి) గ్రామానికి చెందిన ఒక వర్గం వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వన్నెల్ (బి) ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆధ్వర్యంలో ప్రజవాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందులో దేవీదాస్, ఊశన్న, ఎర్రన్న, నర్సయ్య, రత్నయ్య, తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా రైస్‌మిల్ నిర్మించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వానరసేన ఇందూరు జిల్లా కన్వీనర్ వెంకటేష్ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నందిపేట్ మండలం తల్వేదలో ఎలాంటి అనుమతులు లేకుండా మాజీ సర్పంచ్ రైస్‌మిల్‌ను నిర్మిస్తున్నాడని తెలిపారు. దేవాలయానికి దానం చేసిన భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశాడన్నారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్‌తో కలిసి దేవాలయ భూములను ఖాళీగా ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు.

నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి..

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 23 ఫిర్యాదులు అందాయి. సమస్యల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. శాంతిభద్రతలను పరిష్కరిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని సీపీ సాయిచైతన్య తెలిపారు.

‘ప్రజా పాలన’ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- ముఖ్య అతిథిగా సీఎం సలహాదారులు నరేందర్ రెడ్డి
- కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమావేశమై ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి సలహారులు వేం నరేందర్ రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్యఅతిథితో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందిగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లనుక్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షించాలని తెలిపారు. వేదిక, కూర్చునే ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రె యినీ కలెక్టర్ కరోలిన్ చింగ్రియాన్ మావి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏం జరుగుతోంది?

(5వ పేజీ తరువాయి)

స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు పనిచేస్తున్నాయి. త్వరలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉండగా అధికార పార్టీ ఆ ఎన్నికపై దృష్టిపెట్టింది. కవిత రాజీనామాను ఆమోదించిన మరుక్షణమే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. రాజీనామా ఆమోదం పొందిన ఆరు నెలల్లోపూ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల పాలకవర్గాలు లేకపోవడం సాంకేతికంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం లేదు. దీంతో శాసనమండలి చైర్మన్ ఆమె రాజీనామాను పెండింగ్‌లో పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించి సస్పెన్షన్‌కు గురైన కవిత గత కొద్దిరోజులుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. పలువురు బీఆర్‌ఎస్ నేతలు, జాగృతి కార్యకర్తలు ఆమెను కలుస్తున్నప్పటికీ సొంత పార్టీ విషయంలో లేదా ఇతర పార్టీలకు వెళ్లే విషయంపై ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడంతో ఆమె వెంట నడుస్తున్న నాయకులు, కార్యకర్తలు సందిగ్ధంలో ఉన్నారు.

సొంత పార్టీ వైపా.. లేక ఇతర పార్టీలలోకా..

మాజీ సీఎం కేసీఆర్ కూతురుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో రాణించిన కవిత 2019 నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయంగా వెనుకబాటుకు గురైంది. ఆ తర్వాత నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నప్పటికీ గతంలో ఉన్నట్లు చురుకైన రాజకీయాలు చేయలేదు. తెలంగాణ జాగృతి సంస్థ పేరుతో బతుకమ్మ సంబరాలతో పాటు ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ గత రెండు మూడేళ్లగా ఆ కార్యక్రమాలు కూడా ఆశించిన మేర నిర్వహించడం లేదు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లినప్పటి నుంచి ఆమె జిల్లాకు కూడా పెద్దగా రావడం లేదు. బీఆర్‌ఎస్‌లో తన ప్రాధాన్యం తగ్గడం, ఆమె కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అవడం, ఆతర్వాత జరిగిన పరిణామాలు ఆమె సస్పెన్షన్‌కు దారి తీశాయి. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ జాగృతి నేతలు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె సొంత పార్టీ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు సైతం ఆమెను తమ పార్టీలో చేర్చుకోమని బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె సొంత పార్టీవైపే వెళ్లే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సోమవారం ఆమె దివంగత నేత పి.జనార్ధన్‌రెడ్డి కుమారుడు, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణుతో భేటీ కావడం చర్చనీయాంశమైంది. సొంత పార్టీ పెట్టే ఆలోచనలో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తన పార్టీ తరపున విష్ణుని అభ్యర్థిగా పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారిద్దరు భేటీ కావడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది.

పకడ్బందీగా జాబితా పునఃపరిశీలన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2026 ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌వోలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బీహార్ రాష్ట్ర సాధారణ ఎన్నికల దృష్ట్యా ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, తెలంగాణలోనూ పొరపాట్లు, తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయలన్నారు. 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను సరిపోల్చుకోవాలని సూచించారు. ఈ వీసీలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్రియాన్ మావీ, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ మాల్వియా, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్‌డీవో రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది కార్తిక్, జితేందర్ పాల్గొన్నారు.

విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి బహుమతులను అందజేశారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలో విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆగస్టు 25న నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి 5కె రన్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో సిద్ధార్థ్ మొదటిస్థానం, బాలాజీ రెండవ బాలికల విభాగంలో శ్రీవర్ధిని విజేతగా, అఖిల రెండ బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్రియాన్ మావీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, టీబీ నియంత్రణ అధికారి దేవినాగేశ్వరి, డీఈవో అశోక్, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు, సుధాకర్, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



సరుకులు, నగదును అందజేస్తున్న నాయకులు

ధర్పల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోసంగి కాలనీలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఇళ్లు దగ్ధం కావడంతో బాధిత కుటుంబాలు వీధినపడ్డాయి. సోమవారం రెండు కుటుంబాలకు నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్‌ల ఆదేశాల మేరకు ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, ధర్పల్లి మాజీ సొసైటీ చైర్మన్ కిశోర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ భూమేష్, చిన్నారెడ్డి, వెంకట్రావ్ పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబాలకు బీజేపీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్, ధర్పల్లి మాజీ సర్పంచ్ కర్క గంగారెడ్డి, సరిచంద్, అమృనాయక్, రాజశేఖర్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధర్పల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మైలారం గ్రామానికి చెందిన రైతులు సోమవారం మండలకేంద్రానికి తరలివెళ్లారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఖరీఫ్ వరి పంటను కొనుగోలు చేయాలని ధర్పల్లి ఐకేపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం చిన్నయ్య డీపీఎంతో మాట్లాడారు. సాధ్యసాధ్యాలను పరిశీలించి, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానని డీపీఎం హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పైడిపల్లి నర్సయ్య కాంగ్రెస్‌లో చేరగా.. ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యకర్తలకు సమస్య ఉంటే నేరుగా కలిసి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తరుణ్‌కుమార్, యశ్వంత్, సంజీవ్‌గౌడ్, అనంత్, సాయికుమార్, అభిలాష్, మహ్మద్ హయాన్, అఫ్రీన్, భాస్కర్, ఈగనారాయణరెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ...

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బాపూజీ వచనాలయ అధ్యక్షుడు గడ్డం భక్తవత్సల్యం నాయుడు కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించారు. భక్తవత్సల్యం సోదరుడు లీలావినోద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, కాంగ్రెస్ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, అగ్గు భోజన్న, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి బాగా చదవాలి



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎస్సై

సిరికొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల నుంచి బాగా చదవడం అలవరుచుకోవాలని ఎస్సై జాడీ రామకృష్ణ విదార్థులకు సూచించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులను ఎస్సై రామకృష్ణ పంపిణీ చేసి మాట్లాడఆరు. చదువు విద్యార్థి ఎదుగుదలకు పునాది అని, ఇప్పటి నుండే చదువడం, రాయడం బాగా అలవరుచుకోవాలని ఎస్సై సూచించారు. పాఠశాలలో క్రమశిక్షణతో మెలుగాలని కోరారు. క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములు, ప్రధానోపాధ్యాయుడు నరేష్, వీడీసీ చైర్మన్ స్వామి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్ గౌడ్, వీడీసీ సభ్యులు రాజలింగం, కాంగ్రెస్ నాయకులు ఆసీఫ్, రాము పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ-ఫార్మసీలో మిగిలిన సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఎస్.అనురాధ తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కళాశాల ప్రాంగణంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చదివిన వారు రావాలన్నారు. ఇంటర్ మార్కుల మెమో, ఒరిజినల్ టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో రావాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 9959749166ను సంప్రదించాలని కోరారు.

సిర్నూర్ పాఠశాలలో హిందీ దివస్



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మోపాల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ ఉన్నత పాఠశాలలో హిందీ దివాస్‌ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలందరిని ఏకం చేసే భాష హిందీ అని, దానిని విద్యార్థులందరూ బాగా నేర్చుకొని జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అన్ని భాషల అనుసంధాన భాషగా హిందీ అని గుర్తించడానికి మహాత్మగాంధీజీ కృషి చేశారని హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ హజారే శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, గాయత్రీ, నీలేశ్, అక్బర్ పాషా, వందన, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్చరల్ కార్యదర్శిగా శ్రీనివాస్

ఇందల్వాయి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పద్మశాలి వసతి గృహం కల్చరల్ కార్యదర్శిగా ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు తన్నీరు శ్రీనివాస్ సోమవారం ఎన్నికయ్యారు. కల్చరల్ కార్యదర్శిగా ఎన్నికైన తన్నీరు శ్రీనివాస్‌ను బీజేపీ నేతలు సన్మానించారు. మరెన్నో ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు కుంట మోహన్‌రెడ్డి, భోజన్న, నాయకులు కేపీరెడ్డి, నాయుడు రాజన్న, దాసు, జగత్ పాల్గొన్నారు.

విమోచన దినోత్సవంపై ఫొటో ఎగ్జిబిషన్

● ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విమోచన దినోత్సవం ఇతివృత్తంతో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని, ముఖ్య అతిథులుగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరవుతారని పేర్కొంది.

మూడో డిపోపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడో కల్లు డిపోలో అర్హులైన గీత కార్మికులకు అవకాశం కల్పించకుండా స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చారని గీత కార్మికులు సురేష్‌గౌడ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నగరంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇతర దేశాల్లో ఉన్న సభ్యులకు, ట్యాపింగ్ టెస్ట్‌లో పాల్గొనని వారికి సభ్యత్వం కల్పించారని సురేష్‌గౌడ్ వివరించారు. తాత్కాలికంగా ఆధార్‌కార్డు మార్చి సభ్యత్వం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో డిపో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నవీన్, భిక్షపతి, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ కార్మికుల నుంచి చట్టవ్యతిరేకంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రియదర్శిని కంజూమర్ అసోసియేషన్‌పై చర్యలు తీసుకోవాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లో కార్మికుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి ప్రతి నెలా రూ.10,555 జీతాల నుంచి కట్ చేస్తున్నారని తెలిపారు. 2007 నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి వసూలు చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారంతో ఉద్యమాన్ని ఆపలేరు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల అరెస్ట్ సరికాదని, అధికారంతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. నిర్బంధం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలనుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం బాధ్యత అని ప్రభుత్వం చెబుతూ.. మరోకవైపు అరెస్టులతో ఉద్యమాన్ని అరికడుతోందని ఆరోపించారు.

దిశ సమావేశం వాయిదా

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దిశ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు డీఆర్డీవో సాయాగౌడ్ సోమవారం తెలిపారు. మంగళవారం జరగాల్సిన దిశా సమావేశం వాయిదావేసి, 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

సిరికొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండూరు గ్రామంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నిజామాబాద్ పట్టణంలో పనిచేస్తున్న కొంత మంది ఉద్యోగులు నిత్యవసర సరుకులు తీసుకొచ్చి బాధితులకు పంపిణీ చేశారు. పట్టణంలో పనిచేస్తున్న ఉద్యోగులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి 50వేల విలువగల పప్పులు, బియ్యం, నూనె, నిత్యవసర సరుకులను 36 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బాల్‌రాజ్, సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగి గంగాధర్, అరుణ, వెంకట్, సిరికొండ మాజీ సర్పంచ్ రవిశంకర్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నేతలు



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఇందూరు నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడిగా ఏడాది పదవికాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లా, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, తదితరులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం, శాలువాను అందజేసి సన్మానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.



సిరికొండలో నిరసన తెలుపుతున్న నాయకులు



ఇందల్వాయిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ..



మోపాల్‌లో వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లను పెంచి, వెంటనే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మోపాల్, సిరికొండ, ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడిచిపోతున్నా.. ఇచ్చిన హామీ నెరవేర్చడంలో లేదని మండిపడ్డారు. పెంచిన పెన్షన్‌లను ఇచ్చేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో మండల నాయకులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

సినిమా గైడ్

దేవి	: లిటిల్ హార్ట్స్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: కొత్త లోక (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: కిష్కింధపురి (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: మిరాయి (11.00, 10.30)
	:కిష్కింధపురి (1.55,7.30)
	:డెమన్ స్లేయర్ (ఇంగ్లీష్)(4.30)
స్క్రీన్-2	:లిటిల్ హార్ట్స్ (11.00)
	:మిరాయి (1.30,4.30) : కొత్తలోక (7.30)
	:డెమన్ స్లేయర్ (ఇంగ్లీష్)(10.30)
స్క్రీన్-3	:డెమన్ స్లేయర్ (ఇంగ్లీష్)(10.30)
	: కొత్తలోక (1.30) : లిటిల్ హార్ట్స్ (4.30,10.30)
	:మిరాయి(7.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: లిటిల్ హార్ట్స్ (10.20, 1.05)
	: మిరాయి (3.50, 7.15, 10.40)
స్క్రీన్-2	: మిరాయి (10.00, 1.25)
	: డెమన్ స్లేయర్ (ఇంగ్లీష్) (4.50)
	: లిటిల్ హార్ట్స్ (8.05, 10.50)
స్క్రీన్-3	: డెమన్ స్లేయర్ (ఇంగ్లీష్) (10.10, 1.25, 7.25)
	: కిష్కింధపూరి (4.40, 10.40)
స్క్రీన్-4	: కిష్కింధపూరి (10.50)
	: ది కంజూరింగ్ లాస్ట్ రైట్స్ (ఇంగ్లీష్) (1.35, 7.35)
	: కొత్తలోక (4.30, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,14,200	రూ.1,05,300	రూ.1350



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో) :	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో) :	రూ.175	రూ.265	రూ. 285